క్లుప్తంగా

ఇల్లెందు విద్యార్థుల సత్తా



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

ఇల్లెందు: పట్టణంలోని మాంటిస్సోరి విద్యార్థులు రాష్ట్రస్థాయి నృత్య ప్రదర్శనలో రాణించారు. ఈ నెల 21న హైదరాబాద్ రవీంద్రభారతిలో తెలంగాణ బోనాలు సందర్భంగా నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఇల్లెందు మాంటిస్సోరీ స్కూల్, నటరాజ సంప్రదాయ నృత్య పాఠశాల విద్యార్థులు ఈసం శ్రీలక్ష్మీతేజస్విని, శరణ్య, పౌర్ణమిక, నవ్య ప్రతిభను చాటారు. సినీనటి రాగిణి, భారత ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకులు లలిత చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో నాణ్య గురువు బస్వరాజు రాంబాబు, శివజ్యోతి పాల్గొన్నారు.

సీపీఐలో చేరిన మాజీ ఎంపీటీసీ



విజయారావును పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సమక్షంలో సోమవారం పాల్వంచ మండలం నాగారం మాజీ ఎంపీటీసీ బాదావత్ విజయారావు సీపీఐలో చేరారు. పార్టీ కండువా కప్పి ప్రాథమిక సభ్యత్వాన్ని ఇచ్చి ఎమ్మెల్యే ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, పాల్వంచ పట్టణ కార్యదర్శి అడుసుమల్లి సాయిబాబు, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, సహాయ కార్యదర్శి గుండాల నాగరాజు, మన్నెం వెంకన్న, శనగారపు శ్రీనివాసరావు, బానోత్ రంజిత్, బానోత్ రవి, సీహెచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారుల కష్టాలు



ఉల్వనూరు వెళ్లే రోడ్డుకిరువైపులా ప్రమాదకరంగా చెట్ల కొమ్మలు

పాల్వంచరూరల్: మండలంలోని మొండికట్ట నుంచి ఉల్వనూరు సమీపంలోని బ్రిడ్జి వరకు రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలకు చెందిన కొమ్మలు ఉండటంతో ద్విచక్రవాహనదారులు, ఆటోలు, కార్ల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు రూ.24 కోట్ల వ్యయంతో రెండేళ్ల కిందట తారు రోడ్డు నిర్మించారు. కానీ, రోడ్డు మూలమలుపుల వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డుల సూచికలను ఏర్పాటు చేయలేదు. దీంతో వాహనదారులకు కష్టాలు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా చెట్ల కొమ్మలు కట్ చేయాలని కోరుతున్నారు. కాగా, ఈ అంశంపై ఆర్‌అండ్‌బీ ఏఈ వంశీని వివరణ కోరగా.. ఉల్వనూరు రోడ్డులో జంగల్ కటింగ్, ప్రమాద హెచ్చరిక బోర్డులు, మైలు రాళ్ల ఏర్పాటుకు టెండర్లు నిర్వహించి త్వరలోనే పనులు చేపడుతామని తెలిపారు.

గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

టేకులపల్లి: మండల కేంద్రంలోని కేజీబీవీలో తాత్కాలిక పద్ధతిలో పీజీ బోటనీ అధ్యాపక పోస్టు ఖాళీగా ఉందని కళాశాల ఎస్‌ఓ సంతు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోటనీ సబ్జెక్టులో పీజీ, బీఈడీ పూర్తి చేసిన మహిళా అభ్యర్థులు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, అన్ని స్టడీ సర్టిఫికెట్లు, ఆధార్ జిరాక్స్‌తో టేకులపల్లి కేజీబీవీలో సంప్రదించాలని, పూర్తి వివరాలకు 76809 76663 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.


బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు

పాల్వంచరూరల్: ఇంట్లోకి దూరి ఓ వివాహితను చంపుతానని బెదిరించిన వ్యక్తిపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఏఎస్‌ఐ సుధాకర్ కథనం ప్రకారం.. మండలంలోని కేశవాపురం గ్రామానికి చెందిన బి.వీరన్న.. తమ బంధువు అయిన శారద ఇంటికి నాలుగు రోజుల కిందట అక్రమంగా చొరబడి చంపుతానని బెదిరించాడు. బాధితురాలు శారద సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వీరన్నపై కేసు నమోదు చేశామని ఏఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.

సమస్యలతో సతమతం

చెత్త కదలదు.. మురుగు పోదు

- పలుగ్రామాల్లో అధ్వానంగా పరిస్థితి
- అస్తవ్యస్తంగా వీధి దీపాల నిర్వహణ
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



వేపలగడ్డ గ్రామంలో మురుగు నీటితో నిండిన కాల్వ

సుజాతనగర్: పేరుకుపోయిన చెత్త కుప్పలు.. వీధుల్లో పారుతున్న మురుగు నీరు.. దోమల స్వైర విహారం.. వెరసి ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సుజాతనగర్ మండల కేంద్రంతో పాటు, ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించి పరిస్థితులు అధ్వానంగా మారాయి. నిధుల కొరతతో అధికారులు నామమాత్రంగా పనులు కొనసాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సుజాతనగర్ మండలంలోని ఏడు గ్రామ పంచాయతీలు కొత్తగూడెం కార్పొరేషన్‌లో కలిశాయి. మండల కేంద్రం సుజాతనగర్‌తో పాటు ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేయకపోవడంతో ఎటువైపు చూసినా.. దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో పాటు దోమలు స్వైరవిహారం చేస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తుండడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది.

దోమలతో అవస్థలు

మండలంలోని ఆయా గ్రామాల్లో చెత్త సేకరణ సరిగా జరగకపోవడంతో ఎక్కడ పడితే అక్కడ చెత్తను వేస్తున్నారు. దీంతో తీవ్ర దుర్వాసనతో పాటు దోమలు స్వైర విహారం చేయడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. గ్రామాల్లో మురుగు కాల్వల నుంచి తీసిన పూడిక మట్టిని తరలించకపోవడంతో మళ్లీ అది కాల్వలో పడి పారిశుద్ధ్యం లోపిస్తోంది. నెలల తరబడి మురుగు కాల్వలు రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త నీటితో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. దోమల నివారణకు మురికి కాలువల్లో క్రిమి సంహారక మందు పిచికారీ, ఫాగింగ్ వంటి కార్యక్రమాలు సక్రమంగా చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేషన్‌గా రూపాంతరం చెందినా పారిశుద్ధ్యం విషయమై ఎలాంటి మార్పు లేదని స్థానికులు పెదవి విరుస్తున్నారు.

ఫాగింగ్ ఏది?

ఏటా వర్షాకాలం సమీపించే ముందు గ్రామాల్లో మురుగు కాల్వలు శుభ్రపరిచి గ్రామాల్లో క్రిమి సంహారక మందు చల్లేవారు. దీంతో పాటు విధిగా ఫాగింగ్ చేసేవారు. గ్రామాల్లో ఈసారి మాత్రం ఇంతవరకు క్రిమి సంహారక మందు చల్లడం, ఫాగింగ్ వంటి కార్యక్రమాలు చేయలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.



సుజాతనగర్‌లో రోడ్డుకిరువైపులా పిచ్చిమొక్కలు

వెలగని వీధి దీపాలు

సుజాతనగర్, వేపలగడ్డ గ్రామాల్లో అక్కడక్కడా కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. వీధుల్లో పెరిగిన చెత్త ప్రభావంతో వీధి లైట్లు కూడా వెలగకపోవడంతో సాయంత్రం బయటకు వెళ్లాలంటే బయపడాల్సిన దుస్థితి నెలకొంది. వర్షాకాలం కావడంతో విష జంతువులు సంచరిస్తున్నాయి. పంచాయతీ అధికారులకు చెపితే కార్పొరేషన్ వారికి చెప్పమంటున్నారని ప్రజలు అంటున్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి



మండల వ్యాప్తంగా చెత్త సేకరణ సరిగా జరగకపోవడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఎక్కడ పడితే అక్కడ చెత్తను వేస్తుండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. అధికారులు స్పందించి తక్షణమే పారిశుద్ధ్య పనులు చేపట్టాలి.

–కాట్రాల తిరుపతిరావు, సుజాతనగర్

త్వరలోనే ఫాగింగ్



మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రత్యేకంగా పారిశుద్ధ్య పనులు చేపడుతున్నాం. రోడ్లపైన మురుగు నీరు నిల్వకుండా చర్యలు తీసుకుంటున్నాం. చెత్తను ఎప్పటికప్పుడు సేకరించి, డంపింగ్ యార్డుకు తరలించే పనులు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందిస్తాం. త్వరలో ఫాగింగ్ చేపడతాం.

–బి.భారతి, ఎంపీడీఓ, సుజాతనగర్

పేదల కోసం ‘సీఎంఆర్‌ఎఫ్’



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

ఇల్లెందు: అనారోగ్యం పాలైన పేదల వైద్య ఖర్చుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్ తోడ్పాటును అందిస్తుందని ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలు ఉన్నత వైద్యం పొందేందుకు ఈ ఫండ్ ఉపయోగపడుతుందన్నారు. సోమవారం ఇల్లెందులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 85 మందికి రూ.27 లక్షలకు సంబంధించిన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యంలో పేదల కోసం ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏడాదిన్నర కాలంలో ఉచిత బస్ ప్రయాణం, 200 యూనిట్లలోపు విద్యుత్ వాడకం, రైతు భరోసా, సన్న వడ్లకు బోనస్, సన్న బియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు ఇలా అనేక పథకాలు ప్రవేశ పెట్టి అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రాంబాబు, కాంగ్రెస్ పట్టణ మండల అధ్యక్షులు డానియేల్, సైదులు, మండల రాము, మడుగు సాంబమూర్తి, చిల్లా శ్రీను, సూర్యం, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు, వార్డు నేతలు పాల్గొన్నారు.

ఆస్పత్రి నిర్మాణ పనుల పరిశీలన

పట్టణంలో రూ.28 కోట్లతో నిర్మిస్తున్న 100 పడకల ఆస్పత్రి పనులను ఎమ్మెల్యే కోరం కనకయ్య సోమవారం పరిశీలించారు. ఇంజనీరింగ్ అధికారులతో కలిసి నిర్మాణ పనులను పరిశీలించి, వేగంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకుని రావాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ



భూమి పూజ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జూలూరుపాడు: మండలంలోని పడమటనర్సాపురం గ్రామంలో పలు ఇందిరమ్మ ఇళ్లకు సోమవారం కాంగ్రెస్ మండల నాయకుడు లేళ్ల గోపాల్‌రెడ్డి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు చిరకాల స్వప్నమైన సొంతింటి కలను నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తోందని తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి పని చేస్తున్నారని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తెల్లబోయిన మల్లికార్జున్, ముివ్వా శ్రీను, వెలగా తిరుపతిరావు, బాదావత్ హరీశ్, మొగిలిచర్ల సాయి, బూరం రమేశ్, తెల్లబోయిన రామయ్య, ఉగ్గం రామకృష్ణ, ఆళ్ల అన్వేశ్, ఎస్కే పెద్ద సైదులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సింగరేణి యాజమాన్యంతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలోని జీఎం కార్యాలయంలో గుర్తింపు కార్మిక సంఘం (ఏఐటీయూసీ), ప్రాతినిధ్య సంఘం (ఐఎన్‌టీయూసీ)నాయకులతో అధికారులు సోమవారం వేర్వేరుగా స్ట్రక్చర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఏరియా జీఎం ఎం.శాలేంరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు సమస్యలు, డిమాండ్లను యాజమాన్యం దృష్టికి తీసుకొచ్చారు. అందుకు జీఎం సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు జే.గట్టయ్య, సముద్రాల సుధాకర్, ఉమాయిన్, ఐఎన్‌టీయూసీ నాయకులు ఎండీ రజాక్, టి.నాగరాజు, జి.సీతారామరాజు, ఎస్వోటూ జీఎం జీవీ కోటిరెడ్డి, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, జీకేఓసీ పీఓ శ్రీరమేశ్, ఎస్‌వీఆర్ ప్రహ్లాద్, కిష్టారం ఓసీపీఓ ఎంవీ నర్సింహారావు, డీజీఎం ఐఈడీ యోహాన్, వర్క్‌షాపు ఎస్ఈ శ్రీకాంత్, లక్ష్మణమూర్తి, ఆర్‌సీహెచ్‌పీ కరీముల్లా పాల్గొన్నారు.

28న ‘చలో కలెక్టరేట్’



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

పాల్వంచ: పెండింగ్‌లో ఉన్న రూ.8,600 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరుతూ 28వ తేదీన జరిగే చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర నాయకులు బి.వీరభద్రం, కేలోతు సాయికుమార్, గుగులోతు సూర్యప్రకాష్ కోరారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో చలో కలెక్టరేట్ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మూడు సంవత్సరాల కాలంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నీరుగార్చిందన్నారు. ఇప్పటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తిరిగి అదే విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. సంక్షేమ వసతి గృహాల్లో చదువుకునే విద్యార్థులకు 5 నెలలుగా డైట్ బిల్లులు చెల్లించడం లేదని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నరేశ్, యాకూబ్, అజయ్, సునీల్, వినయ్, వరుణ్, ఆకాష్, ప్రసన్న, కల్యాణ్ పాల్గొన్నారు.

పోరాటాలకు సహకరించండి..

టేకులపల్లి: ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాలో దశలవారీ పోరాటాన్ని జయప్రదం చేయాలని తెలంగాణ టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గుగులోత్ హరిలాల్‌నాయక్ కోరారు. సోమవారం మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల షెడ్యూల్ ప్రకటించాలని, అన్ని రకాల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో తొలి దశగా జూలై 23, 24 తేదీల్లో మండల కేంద్రాల్లో అధికారులకు వినతిపత్రం సమర్పణ ఉంటుందని, రెండో దశలో ఆగస్టు 1న సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద ధర్నా, మూడో దశలో ఆగస్టు 23న చలో హైదరాబాద్ ఉంటుందని పేర్కొన్నారు.

మోస్తరు వర్షం.. రైతుల్లో హర్షం



మొక్కజొన్న చేనులో నిలిచిన వర్షపు నీరు

ఇల్లెందురూరల్: ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో కొద్దికాలం ముఖం చాటేసిన వరణుడు ఎట్టకేలకు కరుణించాడు. వారం రోజులుగా తేలికపాటి వర్షాలు కురుస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం మోస్తరు వర్షం పడటంతో పంటలకు జీవం పోసినట్లయిందని రైతులు తెలిపారు. ఇదే క్రమంలో ఒకటి రెండు మంచి వర్షాలు కురిస్తే చెరువులన్నీ జలకళ సంతరించుకునే అవకాశం ఉంది.

రేపు విద్యాసంస్థల బంద్



మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఇల్లెందు: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 23న జరిగే విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని పలు విద్యార్థి సంఘాల నేతలు కోరారు. సోమవారం ఇల్లెందు సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయా సంఘాల నేతలు గణేశ్, కిషన్, జి.గణేశ్, రాజేశ్, శ్యామ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ విద్యా సంస్థలను నిర్వీర్యం చేస్తోందని, మూడేళ్లుగా స్కాలర్ షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8,600 కోట్లు ఉన్నాయని తెలిపారు. దీంతో పేద విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారని చెప్పారు. పాఠశాలల్లో అనేక మౌలిక సమస్యలను పరిష్కరించటంలో ప్రభుత్వం చొరవ చూపటం లేదని పేర్కొన్నారు. బుధవారం జరిగే విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నేతలు మహేశ్, నాగరాజు, కిశోర్, భార్గవ్, సాయి పాల్గొన్నారు.

మల్లికార్జునఖర్గే పుట్టినరోజు వేడుకలు



కేక్ కట్ చేస్తున్న కె.శ్రీనివాసరావు, నాయకులు

పాల్వంచ: అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షుడు, కేంద్ర మాజీ మంత్రి మల్లికార్జునఖర్గే పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కాల్వ భాస్కర్ రావు, ఎస్‌వీఆర్‌కె.ఆచార్యులు, కాపర్తి వెంకటాచారి, వై.వెంకటేశ్వర్లు, కందుకూరి రాము, చాంద్‌పాషా, నాగేశ్వరరావు, వాసుమల్ల సుందర్‌రావు, ఉపేందర్, కాపా శ్రీనివాసరావు, బాషా, శేఖర్, రవి, జనార్దన్‌రెడ్డి, అజిత్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

ఇల్లెందు: టీయూసీఐ పిలుపులో భాగంగా కాంట్రాక్ట్ కార్మికులు సోమవారం ఇల్లెందు ఏరియా జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. జీఎం వీసం కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షులు యాకుబ్‌షావలి, బ్రాంచ్ కార్యదర్శి కె.రఘు మాట్లాడుతూ కార్మికుల కనీస వేతనం నెలకు రూ.26 వేలు అందజేయాలని, పెన్షన్ రూ.9 వేలు అందజేయాలని, ప్రతీ నెల 7వ తేదీలోపు వేతనాలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకట్, రామ్‌కుమార్, శేఖర్, విజయ రాజేశ్వరి, తరుణ్, బాబూరావు, దుర్గ, చిలకమ్మ, లింగమూర్తి, మధు, భాగ్యమ్మ, అశోక్, చందర్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వంతెనలు

- గుంతలమయమైన దారితో వాహనదారుల బెంబేలు
- రాకపోకలకు ఇబ్బందులు.. తరచూ ప్రమాదాలు
- మరమ్మతులపై పట్టించుకోని ఎన్‌హెచ్ అధికారులు.



లక్ష్మీదేవిపల్లి పాలకేంద్రం వద్ద బ్రిడ్జిపై గుంతలమయంగా మారిన రోడ్డు, దెబ్బతిన్న ఫుట్‌పాత్

కొత్తగూడెంటౌన్: పేరుకు జాతీయ రహదారి.. ఆ రహదారిపై పెద్ద పెద్ద బ్రిడ్జిలు ఉన్నా గల్లీ రోడ్లకు తీసిపోని విధంగా మారాయి. వర్షం వల్ల రోడ్లపైకి చేరే నీటితో బ్రిడ్జిలపై దాదాపు రెండు అడుగుల నుంచి నాలుగు అడుగుల లోతులో గుంతలు ఏర్పడ్డాయి. జిల్లా కేంద్రంలోని రామవరం, కొత్తగూడెం, పాలకేంద్రం బ్రిడ్జిల మీదుగా వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ మార్గంలో రహదారులపై గుంతలతో తరచూ ప్రమాదాలు జరుగుండడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోందని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.

ఎక్కడ చూసినా అంతే..

రామవరంలోని ఎస్‌సీబీనగర్ గోధుమవాగు బ్రిడ్జి, కొత్తగూడెం బస్టాండ్ సెంటర్ సమీపంలోని అండర్ బ్రిడ్జి, పాలకేంద్రంలోని ముర్రేడువాగు బ్రిడ్జి పరిస్థితి అధ్వానంగా మారింది. ఎక్కడ చూసినా గుంతలు, అందులో వర్షపు నీరు చేరి పిల్లకాల్వలను తలపిస్తున్నాయి. అలాగే, పాదచారులు నడిచేందుకు ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్ కూడా గుంతలమయంగా మారడం గమనార్హం. జాతీయ రహదారిపై ఉన్న ఈ బ్రిడ్జిల పైనుంచి విజయవాడ, చంద్రుగొండ, రుద్రంపూర్‌తో పాటు సమీపంలోని ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే, కొత్తగూడెం, రామవరం, లక్ష్మీదేవిపల్లి, విద్యానగర్‌కాలనీ, పాత కొత్తగూడెం, రుద్రంపూర్ వాసులకు సైతం ఇదే ప్రధాన రహదారి. ప్రాణాలను అరచేత పెట్టుకుని ప్రయాణం చేయాల్సి వస్తోందని వాహనదారులు, ప్రజలు ఫిర్యాదు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.



అండర్‌బ్రిడ్జి మార్గంలో ఏర్పడిన గుంత

రామవరం బ్రిడ్జి అధ్వానం..



రామవరం, గోదుమవాగు బ్రిడ్జిపై గుంతలు చాలా ఉన్నాయి. వాటిలో వర్షపునీరు చేరి కాల్వలుగా మారి బ్రిడ్జి పైనుంచి భయాందోళనతో రాకపోకలను సాగించాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు బ్రిడ్జిలకు మరమ్మతులు చేయించి గుంతలను పూడ్చి ప్రమాదాలను నివారించాలి.

–రాజు, ఎస్‌సీబీ నగర్ రామవరం

ప్రమాదకరంగా మారాయి..



కొత్తగూడెం, పాలకేంద్రంలలో ఉన్న బ్రిడ్జిలపై ఉన్న రోడ్లు గుంతలతో అధ్వానంగా తయారయ్యాయి. గుంతలు ఉండటంతో పగలు, రాత్రిళ్లు ఈ మార్గంలో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోంది. గుంతల్లో పడి వాహనదారులకు గాయాలైన ఘటనలు కూడా ఉన్నాయి.

–ఎస్.కే.అక్బర్, నాగయ్యగడ్డ బస్తీ, రామవరం

రోడ్లు, ఫుట్‌పాత్‌లకు మరమ్మతులు చేయిస్తాం

రామవరం గోదుమవాగు, కొత్తగూడెంలోని అండర్‌బ్రిడ్జి, ముర్రేడు వాగు బ్రిడ్జిలను బాగు చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతాం. బ్రిడ్జిలపై ఏర్పడిన గుంతలతో పాటు ఫుట్‌పాత్‌ను కూడా బాగు చేయించి ప్రమాదాలను నివారిస్తాం.

–శైలజ, ఏఈ, ఎన్‌హెచ్‌